క్లుప్తంగా

కోడి పందాలు ఆడితే కఠిన చర్యలు


ఎస్‌ఐ వెంకయ్య

రాజవొమ్మంగి: సంక్రాంతి పేరుతో కోడి పందాలు ఆడినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ ఎస్.వెంకయ్య హెచ్చరించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. కాగా ఇప్పటికే కోడి పందాలు ఆడుతూ పట్టుబడిన, కోడి కత్తులను ఉపయోగించిన పది మంది పాత ముద్దాయిలపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. నేరాలకు పాల్పడకుండా వారికి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

అయోధ్య రాముని అక్షింతలతో ఊరేగింపు


ఊరేగింపులో భక్తులు

గంగవరం: అయోధ్య రాముని అక్షింతలను నెత్తిన పెట్టుకుని గంగవరం గ్రామస్తులు ఆదివారం భారీ ఊరేగింపు నిర్వహించారు. అంతకు ముందు స్థానిక రామాలయంలో పూజలు నిర్వహించి కళశాలతో ఊరేగింపు చేశారు.విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు శేషాచార్యులు, ప్రసాద్, సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ చిన్నాలురావుదొర తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్లు, ట్యాబ్‌ల పంపిణీ

వీఆర్ పురం: మండలంలోని వీఆర్ పురం జూనియర్ కళాశాల,హైస్కూల్ ఆవరణలో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు పెన్షన్ కానుక పంపిణీ ,హైస్కూల్ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనునట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు ఆదివారం తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ నగదు అందచేస్తారని ఆయన చెప్పారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న రామకృష్ణ

గూడెంకొత్తవీధి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా పనిచేయాలని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుందేరి రామకృష్ణ చెప్పారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన, చేపడుతున్న అభివృద్ధి పనులపై విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పనిచేయాలని పిలుపునిచ్చారు.

పుస్తక పఠనంతో జ్ఞాపక శక్తి


విద్యార్థులతో రిక్రియేషన్ గేమ్ ఆడిస్తున్న గ్రంథాలయాధికారి దమయంతి

నర్సీపట్నం: పుస్తక పఠనంతో జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవచ్చునని గ్రంథలయాధికారి పి.దమయంతి విద్యార్థులకు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో మాస్ రీడింగ్ చేయించారు. నీతి కథలు చదివించి ప్రాముఖ్యతను వివరించారు. టెలిస్కోప్ ఆవశ్యకత గురించి విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ వివరించారు. విద్యార్థులకు ఉపశమనం కోసం రిక్రియేషన్ గేమ్ ఆడించారు. గ్రంథాలయానికి రావటం అలవాటు చేసుకోవాలని గ్రంథలయాధికారి సూచించారు.

ప్రగతిపథంలో మన్యం

- అలగాం గెడ్డపై పూర్తయిన వంతెన
- శివారు గ్రామాల్లో జోరుగా రహదారుల పనులు
- తీరిన రోడ్ల సమస్య
- ఆనందంలో గిరిజనులు




వాకపల్లి-పులుసుమామిడి రోడ్డు

జి.మాడుగుల:చినుకు పడితే మన్యంలో ప్రయాణం కష్టతరంగా ఉండేది. టీడీపీ ప్రభుత్వ హయాంలో మన్యంలో అభివృద్ధి జాడ లేకుండా పోయింది. గోతుల రహదారులు, మట్టి రోడ్లు... కానరాని వంతెనలు, కల్వర్టులు దర్శనమిచ్చేవి... చిత్తడి రహదారులతో వాహనచోదకులు, పాదచారులు నానా అవస్థలు పడేవారు.. వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహించే గెడ్డలతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. అత్యవసర సేవలు అందని పరిస్థితి.. నిత్యం డోలీ మోతలు..నిత్యావసరాలు దొరకక ఇబ్బందులు పడేవారు.. గత టీడీపీ పాలకులకు అప్పట్లో గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై స్థానికులు పలు మార్లు వినతులిచ్చినా పట్టించుకునే దాఖలాలు లేవు.. దీంతో సమస్యలతోనే సావాసం చేసేవారు...అయితే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మన్య ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. కోట్లాది రూపాయలతో మన్యంలోని శివారు ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందాయి. దశాబ్దాల రహదారులు, వంతెనల కల సాకారమవడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞలు తెలియజేస్తున్నారు.


పెదపాడులో పూర్తయిన రహదారి

దశాబ్దాల కల సాకారమైన వేళ

మండలంలోని మారుమూల గ్రామాల మధ్య రోడ్లుతో పాటు వంతెనలు నిర్మాణాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దృష్టి సారించింది. గత ఏడు దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలకు రాకపోకలకు తీరని సమస్యగా ఉండేది. గత ప్రభుత్వాలు, పాలకులు గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, బ్రిడ్జిలు నిర్మాణాలు పట్టించుకోలేదు.దీంతో ఈ ప్రాంత గిరిజనులు వర్షాకాలంలో గెడ్డ దాటాలంటే సాహసం చేయాల్సి వచ్చేది. గిరిజనులకు అత్యవసర పనులు నిమిత్తం మండల కేంద్రానికి, ఇతర మైదాల ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రమాదకరంగా ప్రవహించే గెడ్డను దాటాల్సి వస్తుంది. గెడ్డ దాటటానికి ప్రయత్నించి అనేక మంది గెడ్డ ప్రవాహానికి కొట్టుకుపోయిన సంఘటనలున్నాయి. గర్భిణులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆస్పత్రులకు తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ ప్రాంతం వారు అవసరమైన పనులు, నిత్యవసర సరకుల కోసం గుర్రాలపై రాకపోకలు సాగించేవారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మన్యంలోగ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసింది. గిరిజనులు ఎదుర్కొంటున్న రోడ్లు, గెడ్డలపై వంతెనలు వంటి సమస్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు కనెక్టివిటీ పాడేరు పేరుతో రోడ్లు, ఇంటర్నల్ రోడ్లు, బ్రిడ్జిలు,పెద్దపెద్ద గెడ్డలపై వంతెనలు నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడంతో పనులు చకచకా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మండలంలో ఉవ్వాసింగి పంచాయతీ అలగాం మార్గంలో గెడ్డపై వంతెన నిర్మాణానికి రూ.1.90కోట్లు నిధులు మంజూరు చేసింది.వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో పలు గ్రామాల గిరిజన ప్రజలకు రోడ్డు, రవాణా కష్టాలు తీరాయి. దీంతో పాటు మండలంలోని పాలమామిడి పంచాయతీ పరిధిలోని బొడ్డగొంది, వల్లంగుల, పెదపాడు, ఎస్.పెదబయలు తదితర ప్రాంతాల్లో లక్షలాది రూపాయలతో రహదారుల నిర్మాణం జరిగింది. వంతెనలు నిర్మాణాలతో పాటు రోడ్డు, రవాణా సదుపాయాలు అందుబాటులో వస్తుండడంతో ఈ ప్రాంత గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించడంతో స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.


అలగాం గ్రామం వెళ్లే మార్గంలో గెడ్డపై నిర్మించిన వంతెన


కోడిమామిడి గెడ్డపై నిర్మాణ దశలో వంతెన


అంబలమామిడిలో రహదారి పనులు

శరవేగంగా పనులు

కిల్లంకోట పంచాయతీ ఉవ్వాపల్లి మార్గంలో కోడిమామిడి గెడ్డపై వంతెన నిర్మాణానికి పాడేరు ఐటిడిఏ 2021–22సంవత్సరానికి ఎస్‌సీఏ పథకం కింద రూ.2.20కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ వంతెన నిర్మాణంతో ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాలకు చెందిన అనేక గిరిజన గ్రామాలకు రోడ్డు రవాణా సౌకర్యాలు అందుబాటులోని వస్తున్నాయి. అలాగే కిల్లంకోట, బొయితిలి పంచాయతీల్లో కోడిమామిడి నుంచి కిల్లంకోట వరకు రూ.2.45 కోట్లతో 7కిలోమీటర్ల రోడ్డు, కోడిమామిడి–సరాపల్లి, బూసుపల్లి వరకు రూ.2.80కోట్లతో 8 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులను ఇటీవల సర్పంచ్‌లు బూటారి ముత్యాలమ్మ, లసంగి మాలన్న ప్రారంభించారు. దీంతో పాటు పాలమామిడి పంచాయతీ పరిధిలోని బొడ్డగొంది నుంచి వల్లంగుల వరకు, బొడ్డగొంది నుంచి వల్లంగుల మీదుగా చట్టంపాడు వరకు, బొడ్డగొంది నుంచి పెదపాడు వరకు రూ.40లక్షలతో, ఎస్.పెదబయలు నుంచి మెయిన్‌రోడ్డు నుంచి అంబలమామిడి వరకు రూ.1.85లక్షలతో, అదే విధంగా నుర్మతి పంచాయతీ వాకపల్లి నుంచి బోయితిలి పంచాయతీ పులుసుమామిడి వరకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గడువులోగా పనులు పూర్తి చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

కష్టాలు తీరాయి



టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాలకు సరైన రహదారులు లేవు. వర్షాకాలంలో గెడ్డల ఉధృతితో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఉండేవి. రోగులకు అత్యవసర సేవలు అందేవి కావు. వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంతాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయలు మంజూరు చేశారు. డోలీమోతలకు చెక్ పడింది. గిరిజనుల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. – రమణబాబు, ఎర్రగొప్ప గ్రామం, జి.మాడుగుల మండలం

పింఛన్ల పెంపుతో వెల్లివిరిసిన ఆనందం


.లైగండ పంచాయతీ కేంద్రంలో పింఛన్లు అందజేస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్‌లు


కొత్తభల్లుగుడలో పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ ఉషారాణి, సర్పంచ్ రాధిక

అరకులోయ రూరల్: పింఛన్ పెంపుతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరిస్తోందని ఎంపీపీ ఉషారాణి తెలిపారు. మండలంలో కొత్తభల్లుగుడ పంచాయతీ కేంద్రంలో సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షురాలు కొర్రా రాధిక ఆధ్వర్యంలో ఆదివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఉషారాణి, సర్పంచ్ రాధిక మాట్లాడుతూ సీఎం జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి పెంచిన రూ.3వేల పింఛన్‌ను అవ్వా, తాతలకు అందజేస్తున్నారన్నారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు కావాలంటే జగనన్న ప్రభుత్వం వలనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. అనంతరం లబ్ధిదారులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల కన్వీనర్ పట్టాసి సంపత్ కుమార్, వైస్ సర్పంచ్ ఏల్లేష్, నాయకులు నర్సింగ్, రామ్మూర్తి, సచివాలయం ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని లైగండ పంచాయతీలో పెంచిన పింఛన్లను ఎంపీటీసీ సభ్యుడు బురిడి రామారావు, సర్పంచ్ శాంతి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛన్ల పెంపు హర్షణీయమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్లు పెంచి అందరికీ అందజేయడం అభినందనీయమన్నారు. నాయకులు త్రినాథ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు

- అనకాపల్లి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ సత్యనారాయణ


ఉద్యోగ విరమణ చేసిన దేముడును సన్మానిస్తున్న దృశ్యం

కె.కోటపాడు: ఉద్యోగ ధర్మాన్ని అంకిత భావంతో పని చేసే వారికి ప్రజల్లోను, ఉన్నతాధికారుల్లోను గుర్తింపు లభిస్తుందని అనకాపల్లి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.సత్యనారాయణ తెలిపారు. చోడవరం సబ్ డివిజన్ పోస్టల్ డిపార్టుమెంట్‌లో మైలు ఓవర్‌సీర్‌గా ఉద్యోగ విరమణ చేసిన తానారి దేముడుకు చౌడువాడలో ఆదివారం సన్మానం చేశారు. పుష్పగుచ్ఛం అందించి జ్ఞాపిక బహూకరించారు. ఈ సందర్భంగా డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన దేముడు సేవలను పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఎన్నటికి గుర్తుంచుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టు సంజయ్ పాండా, డేన్‌వుడ్ రిసార్ట్ యజమాని దొగ్గ అచ్చింనాయుడు పాల్గొన్నారు.

అప్పన్నకు ఏకాదశి ఆర్జిత సేవలు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వేడుకగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. అర్చకుడు రఘునాథ్ ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.


స్వర్ణతులసీ దళాలతో ప్రదక్షిణ చేయిస్తున్న అర్చకుడు

సీపీఐ విరాళాల సేకరణ

కొయ్యూరు: మండల కేంద్రంలో ఆదివారం సీపీఐ విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టింది. పార్టీ నేతలు దేముడు, కనకరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం సంత కావడంతో ఎక్కువగా విరాళాలను సేకరించారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పర్యటన రేపు

ఎటపాక: మండలంలో ఈనెల 9న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పర్యటించనున్నట్టు పార్టీ నాయకులు తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయం వద్ద పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ డైరెక్టర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త నాగేంద్ర

గొలుగొండ: ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులకు అధిక లాభాలతోపాటు ఆరోగ్యకరమైన పంటలు పండివచ్చని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్తలు బండి నాగేంద్ర, వాన ప్రసాదరావు తెలిపారు. మండలంలో గింజర్తి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల ఖర్చు తగ్గడంతోపాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. చీడపీడలు సోకవని తెలిపారు. ప్రతీ గ్రామంలో వీటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతి రైతు తప్పకుండా సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో రైతులు పెట్ల నారాయణమూర్తి, రాజశేఖర్, మల్లేస్ పాల్గొన్నారు.

గ్రూపు-2 స్టడీ మెటీరియల్ వితరణ

దేవరాపల్లి: గ్రూపు–2 పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. తారువలోని ఓపెన్ ఆడిటోరియంలో ఆదివారం వీటిని అందజేశారు. ఈ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని ప్రణాళిక బద్ధంగా చదువుకుని మంచి ఫలితాలను సాధించాలని వారికి సూచించారు. ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఆయనతోపాటు పెదగోగాడ సర్పంచ్ పైల వెంకటరమణ వీటిని సమకూర్చారు. బాబూరావు, పి. అప్పలనాయుడు పాల్గొన్నారు.

జోరుగా వరి కోతలు


కుమ్మరాపల్లి సమీపంలో వరి కోతలు

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో వరి కోతలు మరో నాలుగైదు రోజుల్లో పూర్తి కానున్నాయి. ఇప్పటికే కోసి ఆరబెట్టిన పనలను రైతులు కుప్పలుగా వేశారు. ప్రస్తుతం కోసిన పనలను మరో నాలుగైదు రోజుల్లో కుప్పలుగా వేయనున్నారు. మండలంలో ఈ ఏడాది సుమారు 4వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. దీనిలో 1700 ఎకరాల్లో వరిపంట మిచాంగ్ తుపానుతో దెబ్బతింది. పంట నష్టపోయిన రైతుల జాబితాలను వ్యవసాయశాఖ గుర్తించింది. వారికి ప్రభుత్వం పరిహారం అందించనుంది. మరోపక్క రబీ సాగు చేసే రైతులు నారు పెంచుతున్నారు.

పార్టీ మరింత బలోపేతానికి కృషి


వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు అభినందనలు తెలుపుతున్న, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణను వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదివారం పాడేరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైనందున పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా చెట్టి పాల్గుణ నియామకంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నిండుకుందన్నారు. పార్టీ మరింత బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని కోరారు.

వేడుకగా శ్రీ కృష్ణ రుక్మిణీ కల్యాణం


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు


శ్రీకృష్ణ రుక్మిణీ కల్యాణం

అనకాపల్లి : స్థానిక గాంధీనగరం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు రేజేటి అప్పలాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి శ్రీ కృష్ణ రుక్మిణీ కల్యాణం కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా వివాహం కాని 108 మంది యువతీ, యువకులు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం వనభోజన సమావేశం

అనకాపల్లి : బ్రాహ్మణ కుటుంబ సభ్యులందరూ ఐక్యంగా ఉండి రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేయాలని పరశురామ బ్రాహ్మణ సేవా సంఘం జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు నేమనూరి సాంబశివ రావు అన్నారు. మండలంలో సత్యనారాయణపురం శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయ సమీపంలో బ్రాహ్మణ వన సమారాధన- ఆత్మీక కలయిక నియోజకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకమత్యంతో ఏ పనైనా చేయవచ్చని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణులను ఆదుకోవడంలో సంఘం శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. జిల్లాల్లో కల్యాణ మండపాల నిర్మాణానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉపాధ్యాయులంతా ఐక్యంగా మెలగాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం : ఉపాధ్యాయులంతా ఐక్యతతో మెలగి విద్యా బోధనలో మరిన్ని మార్పులు తీసుకురావాలని మండల పీఆర్‌టీయు సంఘ నాయకులు అన్నారు. పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ సమావేశంలో మాట్లాడారు. మహిళా సాధికారిత సంబరాల్లో భాగంగా మహిళలకు పుష్ప గుచ్ఛాలు ఇచ్చి సత్కరించారు.